క్లుప్తంగా

ఘనంగా ఏడు శనివారాల వ్రతం



వ్రత ఫలితం గురించి వివరిస్తున్న అర్చకులు

పోరుమామిళ్ల : శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ఆలయ అధ్యక్షుడు తులసి సురేష్‌బాబు అధ్యక్షతన ఏడు శనివారాల వ్రతం వైభవంగా జరిగింది. వ్రతానికి పట్టణంలోని మహిళలు భారీగా తరలివచ్చారు. ఆలయ అర్చకులు దుర్భాక కిశోర్‌శర్మ శనివార వ్రతం గురించి, వ్రతం ఆచరిస్తే లభించే ఫలితం గురించి వివరించారు. అధిక శ్రావణ మాసం 28 సంవత్సరాలకు ఒకసారి వస్తుందని, అధిక, నిజ శ్రావణమాసాలు రెండింటిని కలిపి ఏడు శనివారాలు వ్రతం ఆచరించడం వలన ఆకస్మిక మృత్యువు నుంచి, శనిదోషం నుంచి నివారణ లభిస్తుందన్నారు. భక్తులకు ఆలయ కార్యదర్శి జనార్ధనశెట్టి, కమిటీ సభ్యులు సుధాకర్ తదితరులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో నాలుగు 4 లక్షల మందికిపైగా ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లు పనిచేస్తున్నారని, వారందరినీ యుడైస్ విద్యార్థుల నమోదుతో పాటుగా నమోదు చేయాలన్నారు. కార్మిక చట్టాలను అనుసరించి టీచర్లు, లెక్చరర్లకు జీతాలు ఇవ్వాలని, అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించకూడదన్న నిబంధనలను అమలు పరచాలని కోరారు.

ప్రజలు బ్రహ్మరథం పడితే ఆరోపణలా?

అట్లూరు : కమలకూరు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకు ప్రజలు అపూర్వస్వాగతం పలికి బ్రహ్మరథం పడితే కొన్ని పత్రికలు, యూటూబ్ చానళ్లు ప్రజాధరణ లేనివిధంగా ఆరోపణలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. కమలకూరు దగ్గర సగిలేరు నదిపై దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అభ్యర్థన మేరకు సుమారు రూ.15 కోట్లతో ఆనకట్ట నిర్మించి ఆగ్రామ ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్నారని ఆవిషయం ప్రజలు మరచిపోలేరన్నారు.

తాగు నీటి బోర్లు ఏర్పాటు



రేకలకుంట గ్రామ సచివాలయం దగ్గర తాగు నీటికి బోరు వేస్తున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని రేకలకుంట పంచాయతీ గ్రామ సచివాలయాలదగ్గర శనివారం మండల ఉపాధ్యక్షురాలు కూన పులి సుహాసి భర్త మండల సచివాలయాల కన్వీనర్ రాజానాయుడు బోర్లను ఏర్పాటు చేసారు. తాగు నీటికి ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలపడంతో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం రామగోవిందరెడ్డిల సహకారంతో తాగునీటికి బోర్లు వేస్తున్నట్లు రాజానాయుడు తెలిపారు.

నేడు చిత్రకవితా సౌరభం పుస్తకావిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : రచయిత వెంకటరమణ రాజు రచించిన చిత్రకవితా సౌరభం పుస్తకాన్ని ఆదివారం ఉదయం స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యులు గ్రేడ్–1 గ్రంథాలయంలో ఆవిష్కరించనున్నట్లు కళాభారతి నాటక సంస్థ కార్యదర్శి కొత్తపల్లి శీను తెలిపారు. కళాభారతి నాటక సంస్థ, బాలల సాహిత్య కళా వేదిక ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభకు రచయిత కొమ్మిశెట్టి మోహన్ అధ్యక్షత వహిస్తారని, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువులబాబు, సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, కవులు ఏసీ దస్తగిరి, భాస్కర్ రాజు, మూలె రామమునిరెడ్డి, జింకా సుబ్రాహ్మణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వివరించారు. సాహితీ అభిమానులు పాల్గొనాలని కోరారు.

1 నుంచి యోగా శిబిరం

కడప కల్చరల్ : కడప పటేల్ రోడ్డులోని మిత్ర యోగా కేంద్రంలో ఆగస్టు 1 నుంచి యోగ శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు డాక్టర్ కె.కల్పన, డాక్టర్ కె.రంగనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో రోగ నిరోధక శక్తిని పెంచుకునేందుకు మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు, అధిక బీపీ, డయాబెటీస్, ఒబెసిటీ లాంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకునేందుకు యోగాసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం తదితర యోగా ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామన్నారు. రోజు ఉదయం 5.30 నుంచి 7.00 గంటల వరకు, 9.00 నుంచి 10.30 గంటల వరకు మహిళల కోసం ప్రత్యేక బ్యాచ్‌గా తరగతులు నిర్వహిస్తామన్నారు. స్త్రీ, పురుషులకు ప్రత్యేకంగా తరగతులు ఉంటాయన్నారు. వివరాలకు 98488 61206, 70132 38986 నెంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

మహిళాభివృద్ధే సీఎం ధ్యేయం

గడప గడపకు మన ప్రభుత్వంలో
ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



పథకాల లబ్ధిని మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. శనివారం మైదుకూరు మున్సిపాలిటీలోని 22వ వార్డు పరిధిలోని వెంకట సుబ్బయ్య కాలనీ, చెంచుకాలనీ, జోసెఫ్ పేట, బీసీ కాలనీల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నుంచి వివిధ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వార్డులో సంక్షేమ పథకాల ద్వారా మొత్తం రూ.5కోట్ల 83 లక్షలు అర్హులు లబ్ధి పొందగా, గృహ నిర్మాణాలు, సీసీ రోడ్లు, నాడు–నేడు వంటి అభివృద్ధి కార్యక్రమాల కింద రూ.4 కోట్ల 11 లక్షలు ఖర్చు చేసినట్టు తెలిపారు.

సమస్యలపై స్పందన

వార్డు ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే రఘురామిరెడ్డి స్పందించారు. వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. వెంకటసుబ్బయ్య కాలనీలో పలు వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు కావాలని అడగగా వెంటనే వేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని అక్కడే ఉన్న విద్యుత్ ఏఈ రామభద్రయ్యను ఆదేశించారు. శ్మశానానికి సరైన రహదారి లేదని చెప్పగా రహదారి ఏర్పాటుకు అంచనా వేయాలని సచివాలయ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వెంకటసుబ్బన్న, వార్డు ఇన్‌చార్జి సొద్దల సురేష్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఏవీ సుబ్బారెడ్డి, మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు కిరణ్మయి, మున్సిపల్ వైస్ చైర్మన్లు షరీఫ్, భరత్‌కుమార్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ట్రాక్టర్ గౌస్, కందనూరు షరీఫ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సొద్దల గుర్రప్ప, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కూశెట్టి రాయుడు, ఆప్కో డైరెక్టర్ వెంకటేష్, భూమిరెడ్డి నరసింహులు, చొక్కం శివ, గౌస్, వీరభద్రుడు, సన్న శ్రీనురావు తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా



కరపత్రాలు ప్రదర్శిస్తున్న సీపీఎం నాయకులు

పోరుమామిళ్ల : విభజనచట్టంలోని హామీలను అమలు చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ తెలిపారు. శనివారం పోరుమామిళ్లలో ఈనెల 31న కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయాలని కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. కడప ఉక్కు పరిశ్రమ హామీ కేంద్రం గాలికి వదిలేసిందని, 2014 విభజన చట్టంలోని కడప ఉక్కు పరిశ్రమ, అనంతపురం కేంద్రీయ విశ్వవిద్యాలయం, కర్నూలు ఐఐఐటీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కండలేరు ప్రాజెక్టు, పారిశ్రామిక కారిడార్ తదితర అంశాలు బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. రాయలసీమ ప్రజల హక్కులను కాపాడుకునేందుకు జరిగే ఈ ధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గౌసియాబేగం, బాలగురయ్య, రమణయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైమానిక దళంలో
అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



ఎయిర్‌వింగ్ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తున్న నాన్ కమిషనర్ అధికారి అరుణ్ గోస్వామి

బద్వేలు అర్బన్ : భారత వైమానిక దళంలో యువతకు అద్భుత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలని ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ నాన్ కమిషనర్ అధికారులు రాజేష్, అరుణ్ గోస్వామి, సునీల్‌దాస్‌లు పేర్కొన్నారు. భారత వైమానిక దళంలో రిక్రూట్‌మెంట్‌పై శనివారం స్థానిక రాచపూడి ఫంక్షన్ హాలులో రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా దరఖాస్తు చేయు విధానం, ఎంపిక ప్రక్రియ, ఎంపికైన అభ్యర్థులకు ఇచ్చేశిక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే అగ్నివీర్ వాయు ఉద్యోగాలకు ఈ నెల 27వతేదీనుంచి ఆగస్టు 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఇంటర్ సైన్స్ విద్యార్థులు, డిప్లమో చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. అనంతరం కళాశాల యాజ మాన్యం ఆధ్వర్యంలో ఎయిర్ వింగ్ అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఏవో, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్‌సీసీ సూపరింటెండెంట్ ప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చలపతి, ఆర్మీ ఏఎన్‌ఓ బాల ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న భోజనశాలలో
మరింత రుచికరమైన వంటలు



వంటశాలలో వంటల రుచిని చూస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి దంపతులు

ప్రొద్దుటూరు : రాచమల్లు వారి రాజన్న భోజనశాలలో ప్రజలకు మరింత రుచికరమైన భోజనాన్ని అందించేందుకే ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి 26వ వార్డు కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి తెలిపారు. రాజన్న భోజన శాలకు సంబంధించి తయారు చేసే వంటలను శనివారం ఉదయం ఎమ్మెల్యే రాచమల్లు దంపతులు స్వయంగా పరిశీలించారు. వంటలను రుచిని చూస్తూ మరింత రుచికరమైన వంటలను వండేందుకు తగు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి దంపతులు మాట్లాడుతూ ప్రతి రోజు 2వేల మందికిపైగా భోజన సదుపాయం కల్పించడం తమ కుటుంబ సభ్యుల మనసుకు ఎంతో సంతృప్తి కలుగుతోందన్నారు. పది రోజులుగా రోజూ మెనూలో మార్పులు చేసి ఇంటికంటే మేలుగా వంటలను తయారు చేసి పంపిస్తున్నామన్నారు.అనంతరం రాచమల్లు వారి రాజన్న భోజనశాలలో ప్రజలకు వారు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీసీపీ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, అగస్త్యేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యుడు మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు రాయపురెడ్డి, కౌన్సిలర్ కమాల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధిక శ్రావణ మాసం రెండవ శనివారం సందర్భంగా వేకువజాము నుండే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్య స్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి



రాజీవ్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ప్రొద్దుటూరు : జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మార్కెట్ యార్డు నుంచి రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పడితే 50వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. జిల్లాలో ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని అన్నారు. ఈనెల 25న కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కాదని చెప్పడం దారుణమన్నారు. స్టీల్ ప్లాంట్‌పై, రాష్ట్ర విభజన హామీలపై టీడీపీ, జనసేన, వైఎస్సార్‌సీపీ పార్టీలు నోరు మెదపడం లేదన్నారు. ఈ మూడు పార్టీలు బీజేపీకి మద్దతు ఇస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, సీఐటీయూ నాయకులు విజయకుమార్, బాలసుబ్బయ్య, ఓబులేసు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సాల్‌మోన్,చంటి, గుర్రమ్మ, ప్రమీలమ్మ, రాఘవ, ఆటోనియన్ నాయకులు రమేష్, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



రోడ్డుకు అడ్డుగా ఉన్న మట్టి దిబ్బలను తొలగిస్తున్న ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి

ఖాజీపేట : ట్రాఫిక్ నిభందనలు అందరూ పాటించాలి.. ఎవ్వరు అతిక్రమించినా చర్యలు తప్పవని ఖాజీపేట ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి స్థానిక ప్రజలకు సూచించారు. శనివారం రోజు పత్తూరు కాశినాయన దగ్గర నుంచి ఖాజీపేట బస్టాండ్ వరకూ రోడ్డు ఇరువైపులా ఉనన మట్టికట్టలను ఆయన పరిశీలించారు. ట్రాక్టర్ డోజర్ సహాయంతో మట్టి కట్టలను పూర్తిగా తొలగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి కట్టల వల్ల రహదారి పూర్తిగా తగ్గిపోయిందని అన్నారు. బస్టాండ్ కూడలిలో వాహనాలు ఇష్టానుసారంగా నిలుపుతున్నారని దీనివల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. అందుకే బస్టాండ్ కూడలిలోని ఆటోవారితో ప్రత్యేక సమావేశం నిర్వహించామని అన్నారు. ట్రాఫిక్ సమస్యపై ప్రతి రోజు ఫిర్యాదులు వస్తున్నాయని అందుకే ట్రాఫిక్ నియంత్రణ పై పూర్తి దృష్టి సారించామన్నారు.

పులుల సంరక్షణపై అవగాహన



పులుల గురించి వివరిస్తున్న అటవీశాఖాధికారులు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక రాజీవ్ గాంధీ నేషనల్ పార్కులో సందర్శకులకు ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా పులుల సంరక్షణపై అటవీశాఖాధికారులు అవగాహన కల్పించారు. 'ప్రకృతి సమతుల్యత – పులి మనుగడ' అనే అంశంపై చేపట్టాల్సిన చర్యలను ఎఫ్ఎస్ఓ ఎస్.రవిచంద్ర వివరించారు. అలాగే భాష్యం పాఠశాలలో పులుల రక్షణపై ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ హేమాంజలి విద్యార్థులకు వివరించారు. దేశంలో 51 టైగర్ క్యారిడార్లు ఉన్నట్లు చెప్పారు. అందులో నాగార్జున సాగర్– శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ దేశంలోనే అతిపెద్ద పులుల క్యారిడార్ అని, ఇందులో 75 పులులు ఉన్నాయని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం



సస్టైనబుల్ బద్వేల్ కార్యక్రమానికి సంబంధించిన లోగో, కాన్సెప్ట్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

బద్వేలు అర్బన్ : పర్యావరణ పరిరక్షణకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వ అధికారులతో పాటు ప్రజలను భాగస్వాములను చేయాలన్న ఉద్దేశ్యంతో వివేక్‌లంకమల అనే యువకుడు తన మిత్రబృందంతో కలిసి చేపట్టిన సస్టైనబుల్ బద్వేల్(స్థిరమైన బద్వేలు) కార్యక్రమానికి సంబంధించిన లోగో, కాన్సెప్ట్ పోస్టర్‌లను శనివారం లంకమల అభయారణ్యంలో కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సస్టైనబుల్ బద్వేల్ పేరుతో పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయడం గొప్ప విషయమన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి బద్వేలు పట్టణంలో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో భాగంగా క్లీన్ బద్వేల్–గ్రీన్ బద్వేల్, నో ప్లాస్టిక్ బద్వేల్ పేరుతో సభ్యులు కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఇటువంటి గొప్ప కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా కూడా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు యువత ముందుకు రావాలని కోరారు. అలాగే ఈ కార్యక్రమాన్ని వెనుకుండి నడిపిస్తున్న ఆర్డీఓ ఆకుల వెంకటరమణ, కార్యక్రమ నిర్వాహకులు వివేక్‌లంకమల, బద్వేల్ గ్యాలరీ వశీం, ఇన్‌టూ ది నేచర్ టీం సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, అరణ్య శేఖర్‌లను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, డీఎఫ్ఓ సందీప్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్‌లు రాహుల్‌మీనా, మౌర్య, కడప కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌చంద్, ఎఫ్ఆర్ఓ వెంకటశేషయ్య, ఎఫ్‌బీఓ రాజేష్‌రెడ్డి, ఇన్‌టూద నేచర్ సభ్యులు సునీల్, శివ, సాయి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక దృఢత్వం

ప్రొద్దుటూరు కల్చరల్ : యోగాతో శారీరక, మానసిక దృఢత్వం కలుగుతుందని బళ్లారికి చెందిన యోగా శిక్షకులు శ్రీవాణి, సజ్జన అన్నారు. స్థానిక ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్ కార్యాలయంలో శనివారం సంధి ధ్యాన్ క్రియ యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంధి ధ్యాన్ క్రియ యోగ సాధన చేయడం ద్వారా ఆలోచనరహిత స్థితికి త్వరగా చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆవోపా ప్రెసిడెంట్ గుండా పద్మనాభయ్య, కార్యదర్శి నరసింహారావు, ట్రెజరర్ సురేష్ బాబు, సుబ్బరాయుడు, రాజా, వరలక్ష్మి, శ్రీనివాసులు, యోగా గురువు మునిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు



ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన బోర్డు

అట్లూరు : ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు శ్రీవాణి హెచ్చరించారు. అట్లూరు రెవెన్యూ పొలంలోని సర్వేనెంబరు 944–3లో ఒక ఎకరా 30 సెంట్లు ప్రభుత్వం స్థలం స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలో ఉంది. ఈ స్థలాన్ని శుక్రవారం ఎవరో ఆక్రమించేందుకు చదును చేయడంతో ఆ స్థలంలో తహసీల్దార్ శనివారం సిబ్బందితో సూచిక బోర్డును ఏర్పాటు చేయించారు. ఎవరైన ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆమె తెలిపారు.

పులులను సంరక్షించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

మైదుకూరు : పులులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్ఓ దివాకర్ అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మైదుకూరులో శనివారం వనిపెంట అటవీ అధికారులు పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డీఎఫ్ఓ దివాకర్ మాట్లాడుతూ వన్య మృగాల్లో విశేషమైనదిగా భావిస్తున్న పెద్దపులిని మన దేశం జాతీయ జంతువుగా గుర్తించిందని అన్నారు. ప్రపంచ దేశాల్లో ఉన్న పులులతో 75 శాతం మన దేశంలోనే ఉన్నాయన్నారు. వనిపెంట అటవీ రేంజి అధికారి ప్రణీతరావు, డీఆర్ఓ శ్యాంసుందర్, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు, అటవీ థానా సిబ్బంది, గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి కవులకు ఆదర్శప్రాయుడు నారాయణరెడ్డి



నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : తెలుగువారి అభిమానాన్ని దోచుకున్న జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి నేటి కవులకు, రచయితలకు ఆదర్శప్రాయుడని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయులు, విశ్వనాథనాయుడు వంటి గేయ కావ్యాలు, రాయప్ప వంటి రూపకాలు కవితా ప్రపంచంలో సినారెకు గౌరవస్థానాన్ని సంపాదించి పెట్టాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చదువులబాబు, శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి కె.మురళీమోహన్ రాజు, ఉపాధ్యాయులు డాక్టర్ ఎన్.నాగేశ్వరరావు, వై.చంద్రశేఖర్‌రెడ్డి, కుందా భాస్కర్, వారధి మధు, జి.రామిరెడ్డి, కోటా ఓబుళరెడ్డి, సూరారెడ్డి, గంగాధర్, రమణయ్య, రామసుబ్బారెడ్డి, ఓబులేసు, సురేంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.

వైభవంగా మొహర్రం వేడుకలు



టంగుటూరులో పీర్ల ఊరేగింపునకు భారీగా తరలివచ్చిన జనం



పోరుమామిళ్ల : సర్కారు చావిడిలో పీర్లు



నేలటూరులో ఊరేగింపులో పీర్లు

రాజుపాళెం : మండలంలోని గోపాయపల్లెలో లాల్‌స్వామి, టంగుటూరులో బాబాఫక్రుద్దీన్ పీర్లను మొహర్రం పండుగ సందర్భంగా శనివారం వైభవంగా ఊరేగించారు. ముందుగా పీర్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ చావిడి వద్ద ఉంచారు. భక్తులు పీర్లకు ప్రత్యేక పూజలు చేసి తొప్పెట్లు, మేళతాళాల మధ్య వైభవంగా ఊరేగించారు. కులమతాలకు అతీతంగా ప్రజలు రంగులు చల్లుకుంటూ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.

దువ్వూరులో..

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరు, నేలటూరు, గుడిపాడు, ఎర్రబల్లె తదితర గ్రామాల్లో శనివారం మొహర్రంను వైభవంగా నిర్వహించారు. 10 రోజులపాటు ఆయా గ్రామాల ప్రజలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతేహా నిర్వహించారు. పీర్ల చావిడిల వద్ద అగ్నిగుండాలను ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం పీర్లను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా జల నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఊరేగింపులో ప్రజలు ఇమాం హుస్సేన్, హసన్‌లను స్మరించుకుంటూ గంధం, పసుపు, రంగులు చల్లుకుంటూ విషాద గీతాలతో పీర్లకు వీడ్కోలు పలికారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : స్థానిక ముస్లింకోట చావిడి, ఉద్దికట్ట వీధి చావిడి, సర్కారుచావిడిలో పీర్లు నిలబెట్టి వారం రోజుల పాటు పీర్లకు చదివింపులు చేస్తూ ప్రార్థనలు చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం చిన్న షరగత్ ఘనంగా నిర్వహించారు. సోమవారం పెద్ద షరగత్‌రోజు గుండం కాల్చుతామని, మంగళవారం పీర్లు నీల్లపడతాయని ముజావర్లు తెలిపారు.

నిరసనలపై డీఈఓ ఇచ్చిన ఉత్తర్వుల ఉపసంహరణ



డీఈఓతో చర్చలు జరుపుతున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు, విద్యార్థులు ధర్నాలు, ర్యాలీల్లో పాల్గొనకూడదని, అలా పాల్గొంటే సీసీఏ రూల్స్ కింద చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి జులై 15న జారీ చేసిన వివాదాస్పద ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారని ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నాయకులతో శనివారం మధ్యాహ్నం డీఈఓ రాఘవరెడ్డి చర్చలకు ఆహ్వానించారు. ఈ చర్చల్లో ఫ్యాప్టో నాయకులు పలు అంశాలను డీఈఓ దృష్టికి తెచ్చారు. దీంతో డీఈఓ ఉత్తర్వులను ఉపసంహరించుకుంటున్నట్లు తెలపడంతో వివాదం ముగిసింది. చర్చల్లో ఫ్యాప్టో చైర్మన్ మాదన విజయ్‌కుమార్ ఇటీవల బదిలీల్లో, పదోన్నతుల్లో జరిగిన కొన్ని అవకతవకలను డీఈఓ దృష్టికి తీసుకురాగా, వాటిని విచారించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని, ఎవరైనా నష్టపోయి ఉంటే వారికి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. డీఈఓ ఉపాధ్యాయులను దుర్భాషలాడుతున్న విషయాన్ని ప్రస్తావించగా.. విద్యాశాఖను గాడిలో పెట్టాలనే అక్కడక్కడా కఠినంగా మాట్లాడానే తప్ప ఉపాధ్యాయులను కించపరచాలనే ఉద్దేశ్యం తమకు లేదన్నారని తెలిపారు. భవిష్యత్తులో స్నేహ పూరిత వాతావరణంలో ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేద్దామని పేర్కొన్నట్లు చెప్పారు. చర్చలు జరిగి సమస్యల పరిష్కారానికి డీఈఓ హామీ ఇవ్వడంతో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆగస్టు 6న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను విరమించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ట్రెజరర్ వెంకటసుబ్బయ్య, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు బాలగంగిరెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, హెచ్ఎం సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, బీటీఏ జిల్లా అధ్యక్షుడు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.